క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి గురువారం తెలిపారు. గజపతినగరం, పురిటిపెంట, గంగచోళ్లపెంట, పాతబగ్గాం, కొత్తబగ్గాం, మదుపాడ, మరుపల్లి, బంగారమ్మపేట, భూదేవిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండపాలెంలో సమగ్ర భూరీసర్వే



డ్రోన్‌తో భూసర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్, నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గరివిడి మండలంలోని కొండపాలెంలో డ్రోన్‌తో సమగ్ర భూరీసర్వేను తహసీల్దార్ టి.గోవింద్, నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భం గా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వేకు రైతులంతా సహకరించాలని కోరారు. రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు రీసర్వేతో పరిష్కారం లభించనుందని చెప్పారు. సర్వేయర్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, నాయకులు పి.కుమార్, కె.వెంకటరమణ, ఎం.సంతోష్, ఇక్బాల్, ఈశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ప్రజారోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో గురువారం నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 50 మందికి వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఎంపీపీ చేతుల మీదుగా ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఇళ్ల వద్దకే వెళ్లి ప్రజలకు వైద్య సేవలందించే 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



చీపురుపల్లి: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఇందిర క్రాంతి పథం(వెలుగు) కార్యాలయం వద్ద వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష గురువారం ప్రారంభించారు. వేసవి కాలం ముగిసేంత వరకు చలివేంద్రం కొనసాగించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. వెలుగు ఏసీ సీతారామయ్య, ఏపీఎం.వి.రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

దత్తిరాజేరు: వేసవి దృష్ట్యా మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లోనూ చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎండీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం ఆదేశించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ఉపాధి వేతనదారులు పనికి వెళ్తున్న మార్గాల్లో తప్పనిసరిగా చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదేశాలు పాటించని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవనిఅన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొత్తవలస: మండలంలోని చిన్నిపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ పండగ అనుపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి ప్రతిమలు,ఘటాలను మేళతాళాల మధ్య భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ ఆర్.పద్మలత, నాయకులు పవన్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

బొండపల్లి: పేదలు ఆర్థికంగా బలపడి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని చినతామరాపల్లి గ్రామంలో గురువారం ఆయన నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు ఆయనకు అడుగడుగునా పూలదండలు వేసి, హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్ సీపీ పాలనలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబం పొందిన లబ్ధిని ప్రజలకు వివరించి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని వారిని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అమలు చేయని విధంగా సీఎం జగన్ గొప్పగొప్ప సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అభివృద్ధి పనులు చేపడుతున్నారని, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తుండడంతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నార న్నారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నామని, కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో అవినీతికి తావులేకుండా ఆదర్శవంతమైన పాలన అందించామని, జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభూజీ, జెడ్పీటీసీ రేపాక సూర్యప్రకాశరావు, ఎంపీపీ చల్ల చల్లంనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ బి.బంగారం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, సర్పంచ్ నడుపూరు భాస్కరనాయుడు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా,ఎంపీడీఓ వేదవతి,నాయకులు గొల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసే విధంగా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు అంతా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోతే అలాంటి వారికి ఇళ్లు రద్దు చేస్తామని అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి నాయకులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలతో హౌసింగ్ అధికారులు సమన్వయం చేసుకుని నిర్మాణాలు పురోగతికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా జగనన్న లేఅవుట్లలో శతశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, పొన్నాడ కుమార్, కొణిశ కృష్ణంనాయుడు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, హౌసింగ్ డీఈ గౌరీశంకర్, నాలుగు మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతుల సదస్సు



సదస్సుకు హాజరైన రైతు సంఘం నేతలు, గిరిజన రైతులు

శృంగవరపుకోట: జీడిరైతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతుసంఘం నేతలు డిమాండ్ చేశారు. మూలబొడ్డవర పంచాయతీ పరిధి భవానీనగర్ వద్ద జీడిరైతుల సదస్సు గురువారం నిర్వహించారు. ఈసదస్సులో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రా సూర్యనారాయణ మాట్లాడుతూ దేశంలో జీడిపప్పు ఉత్పత్తిలో రాష్ట్రం 2వ స్థానంలో ఉందన్నారు. బీడు, మైదాన, అటవీ ప్రాంతాల్లో నాలుగు లక్షల హెక్టార్లలో జీడిపంట పేద వర్గాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉందన్నారు. గతంలో జీడి పంటను జీసీసీ కొనుగోలు చేసేదని, ప్రస్తుతం ప్రభుత్వం పట్టించుకోకుండా దళారీ వ్యవస్థకు అప్పజెప్పేసిందన్నారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని 80 కిలోల బస్తాకు రూ.16వేల మద్దతు ధర నిర్ణయించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో జీడిరైతుల జిల్లా సంఘాన్ని నియమించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మామిడి రాము, జరత గౌరీష్, ఉపాధ్యక్షుడిగా జి.బంగారయ్య, కమిటీ సభ్యులుగా పి.సన్నిబాబు, పి.కృష్ణ, ఎస్.కన్నయ్య, జి.రాంప్రసాద్, జి.బంగారయ్య, జి.అప్పలకొండ, ఊలం గంగరాజు, వి.పైడిరాజు, కె.గంగమ్మ ఎన్నికయ్యారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబురాజు, చల్లా జగన్, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షలతో సీసీ కాలువ నిర్మాణం



జోరుగా సీసీ కాలువ నిర్మాణ పనులు

గజపతినగరం: మండల కేంద్రంలోని కోవెల వీధి నుంచి బీసీ కాలనీ, జయంతి కాలనీ,దిగువ వీధి, ఎస్సీకాలనీలకు సంబంధించి మురుగనీటి కాలువ నిర్మాణ పనులను పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించిన ఈ పనులను ఆయన పరిశీలించారు. కాలువ నిర్మిస్తుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

గుర్ల: మండలంలోని కొండగండ్రేడు గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. కేసు నమోదు చేశామని చెప్పారు.

నేడు ప్రజావేదిక

వేపాడ: మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఇదివరకు సోషల్ ఆడిట్ పూర్తయిందని, ఈ నివేదికలపై మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ సన్యాసినాయుడు గురువారం తెలిపారు. ఉదయం10 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

2న మండల సర్వసభ్య సమావేశం

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మే నెల 2వ తేదీన ఎంపీపీ ఎన్.గోపెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు,సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. అలాగే గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యలపై పరిష్కార నివేదికలు, శాఖల వారీగా ప్రగతి నివేదికలతో మండల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలని వినతి

జామి: మండలంలోని జె.డి.వలస గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకదాన్ని ఎస్సీ, రజక, బలిజ కాలనీకి మార్పు చేయాలని కోరుతూ బీఎస్పీ నాయకులు వేమలి చైతన్య కుమార్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఆయా కాలనీ వాసులు పంచాయతీ కార్యదర్శి కుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రెండు కేంద్రాలు ఒకే కాలనీలో ఉన్నాయని, మిగతా కాలనీకి చెందిన చిన్నారులు, గర్భిణుల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్రానికి వెళ్లే దారిలో ప్రధానరహదారి ఉందని, ఈ రోడ్డును దాటే క్రమంలో చిన్నారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు చొరవతీసుకుని కేంద్రాన్ని మార్పు చేసేలా చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.

సొంత నిధులతో కోనేరు అభివృద్ధి



కోనేరుకు వెళ్లే మార్గంలో నిర్మించిన మెట్లు

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు, సర్పంచ్ ధనలక్ష్మి దంపతులు తమ సొంత నిధులు రూ.1.50 లక్షలతో గ్రామంలోని కోనేరును అభివృద్ధి చేస్తున్నారు. రమేష్ నాయుడు గురువారం మాట్లాడుతూ తన తాత పరిశినాయుడు,నాన్నమ్మ కురమమ్మ,సోదరుడు కూర్మినాయుడు జ్ఞాపకార్థం ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కోనేరుకు వెళ్లే మార్గంలో ఇరువైపులా మెట్ల నిర్మాణం, చుట్టూ ఉన్న కలుపు మొక్కలను తొలిగించి కోనేరును సుందరంగా తీర్చిదిద్దే పనులు చేయిస్తున్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని తెట్టంగి గ్రామంలో ఉపాధి హామీ పనులను మాజీ సర్పంచ్ జమ్ము స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము లచ్చన్న గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని వేతనదారులకు, పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లకు సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పాఠశాలకు రూ.60 వేల క్రికెట్ కిట్ అందజేత

చీపురుపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు జిల్లా పరిషత్ నిధులు రూ.60 వేలతో క్రికెట్ కిట్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇక్కడి పాఠశాల హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు రూ.60 వేలు జెడ్పీ నిధులతో అధునాతన క్రికెట్ కిట్ అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, పాఠశాల హెచ్‌ఎం శ్యామలసాయి, పీఈటీ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రంలో తనిఖీ



శిక్షణ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శృంగవరపుకోట: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వారి సహకారంతో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని వైఎస్సా ర్ క్రాంతి పథం అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలివిడతలో 30 మంది మహిళలకు శిక్షణ పూర్తికాగా, ప్రస్తుతం మరో 30 మంది శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో టైలరింగ్‌కి సంబంధించిన కిట్లను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి శిక్షణ ఎలా నడుస్తోంది, స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు కుట్టిన దుస్తులు పరిశీలించారు. వెలుగు ఎస్.కోట ఏరియా కో–ఆర్డినేటర్ ఎం.జయశ్రీ, జేడీఎం మార్టిన్, ఎస్‌పీఈపీ ఏపీఎం అనూరాధ, పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



గజపతినగరం: ప్రమాదాల నియంత్రణకు ఉపయోగించే పరికరాల పనితీరును వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కొత్తవలస: పరికరాలను ప్రదర్శిస్తున్న అధికారులు

గజపతినగరం/కొత్తవలస: అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గజపతినగరం, కొత్తవలసలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాల వద్ద అగ్నిమాపకశాఖ అధికారులు రవిప్రసాద్, అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలు, వర్తకులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించేటప్పుడు, ఇతర విపత్తుల సమయంలో మంటలు అదుపు చేసేందుకు, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వినియోగించే పరికరాలను సిబ్బంది ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు.

నేడు అవగాహన సదస్సు

గజపతినగరం:బాల్యవివాహాల నిర్మూలనపై జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం ఐసీడీఎస్ పీఓ పి.నాగమణి, ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు గెద్ద ఉమ, సమన్వయకర్త శాంతి కుమారి పాల్గొంటారని పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల: పట్టణంలోని ఎంజేపీఏపీ బీసీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీసీలో 60, బైపీసీలో 40, సీఈసీలో 40 మొత్తం 140 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 28న రాతపరీక్ష నిర్వహించి, జూన్ 10న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. జూన్ 14 నుంచి 17 వరకు ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసి, 17 సంవత్సరాల వయసు మించని విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం – మన్యం జిల్లాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అర్హులైన విద్యార్థులు హెచ్‌టీటీపీ://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పి ంచాలని పేర్కొన్నారు.

హిందూ ధర్మ రక్షణ సమితి కృషి అభినందనీయం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మన సనాతన సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంలో హిందూ ధర్మ రక్షణ సమితి చేస్తున్న కృషి ఎంతైనా అభినందనీయమని ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో మే 14న నగరంలోని కోట జంక్షన్ నుంచి చేపట్టనున్న హనుమాన్ ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆబోతుల శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ..



చీపురుపల్లిరూరల్: రామలింగాపురంలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు అనంతం,తదితరులు

గజపతినగరం, చీపురుపల్లి, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో 'జగనన్నే మా భవిష్యత్ – మానమ్మకం నువ్వేజగన్' కార్యక్రమం 14వ రోజు గురువారం ఉత్సాహం కొనసాగింది. గ్రామాల్లో ఇంటింటికీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు నాయకు లు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరించారు. గత టీడీపీ పాలనలో ఈ స్థాయిలో, ఇంత పారదర్శకంగా పథకాలు అమలయ్యాయా అని ప్రజలను ఆరా తీశారు. పథకాల కోసం ఏ ఒక్కరికీ రూపాయి లంచం ఇవ్వలేదని, పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతృప్తి వ్యక్తం చూశారు. అనంతరం ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించారు.

– సాక్షి నెట్ వర్క్



గుర్ల: భూపాలపురంలో పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు



దత్తిరాజేరు: చెరుకుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ గోవింద్, తదితరులు



జామి: భీమసింగిలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గజపతినగరం: పురిటిపెంటలో ఓ ఇంటికి ఋమా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి..గృహసారథులు